క్లుప్తంగా

29న జడ్చర్లలో ఎస్‌జీఎఫ్ కరాటే ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో ఈనెల 29న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి కరాటే ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్ బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల బాల, బాలికలకు ఉంటాయని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, గురుకుల తదితర యాజమాన్యాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, బోనఫైడ్‌తో రావాలని, వివరాల కోసం కరాటే కోచ్ శంకర్ నాయక్ 9849336930 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

29, 30 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 29, 30 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి కబడ్డీ బాల, బాలికల టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. 29న అండర్–14, 30న అండర్–17 విభాగం బాల, బాలికల కబడ్డీ టోర్నీ ఉంటుందని, ప్రతి మండలం నుంచి 12 మంది బాలురు, 12 మంది బాలికలు హాజరుకావాలని కోరారు. విద్యార్థులు బోనఫైడ్, ఆధార్‌కార్డు సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని ఆయన కోరారు.

బీజేపీలో చేరిక

అడ్డాకుల: మండలంలోని కందూరుకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రమేష్ కండువాలు కప్పి చేర్చుకున్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఇతర పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, రాకేష్, అంజనేయులు, బాలకృష్ణ, నవీన్, శివకుమార్, శంకర్, రమేష్, రఘు, భరత్ తదితరులు ఉన్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి

మహమ్మదాబాద్: ఉమ్మడి మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నందున మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. నిమజ్జనం చేసే సమయంలో యువకులు చెరువుల వద్ద, విద్యుత్ తీగల నుంచి దూరం పాటించాలని సూచించారు. విగ్రహాలు తీసే సమయంలో డీజేలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిమజ్జనం ఆలస్యం చేయకూడదన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

వంటావార్పును విజయవంతం చేయండి

కోయిల్‌కొండ: గార్లపహాడ్ మండల ఏర్పాటు కోసం మండలసాధన సమితి ఆధ్వర్యంలో గురువారం 250వ రోజు రిలేదీక్షలకు నిరసనగా నిర్వహిస్తున్న వంటావార్పు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులతోపాటు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని జేఏసీ కన్వీనర్ రాము నాయక్, వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు నిరసన కార్యక్రమాలను ఆపేదిలేదన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన తండావాసులు

బాలానగర్: మండలంలోని చింతకుంటతండాకు చెందిన 53 మంది బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మణ్‌నాయక్ సమక్షంలో పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక తండాకు బీటీ, సీసీ రోడ్డు, తాగడానికి నీరు, రైతులకు బీమా, రైతుబంధు వంటి ఎన్నో పథకాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో నాగేందర్‌నాయక్, రమేష్, పూల్యా, నార్య, సూర్య, మంజ్యా, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడి ఎంపిక

మిడ్జిల్: ఎన్‌ఎస్‌యుఐ మండల అధ్యక్షుడిగా శ్రీశైలంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్‌వెంకట్ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

దేవరకద్ర: భూత్పూర్ మండల అమిస్తాపూర్ వద్ద అక్టోబర్ 1వ తేదీన ప్రధాని మోడీ సభను విజయవంతం చేయడానికి బీజేపీ నాయకులంతా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎగ్గని నర్సింహులు కోరారు. బుధవారం పట్టణంలో సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చే విధంగా చూడాలన్నారు. ఇప్పటి నుంచే గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, అంజన్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, శేఖర్, శివ, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



జిల్లా కేంద్రంలో నివాళి అర్పిస్తున్న ఎస్పీ నరసింహ

మహబూబ్‌నగర్ క్రైం: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నరసింహ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా అదనపు ఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితం మొత్తం తెలంగాణ కోసం తపించిన వ్యక్తి అని ట్రాన్స్‌కో డీఈ చంద్రమౌళి అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌ఈ కార్యాలయం వద్ద బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవిని లెక్క చేయకుండా రాజీనామా చేసినట్లు తెలిపారు. ఆయన చిరకాల తెలంగాణ రాష్ట్ర కల సిద్ధించినా, చూడకుండానే మన మధ్య లేకపోవడం విచారకమన్నారు.

బీసీ సమాజ్ ఆధ్వర్యంలో..

బీసీ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌సాగర్, రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజు, సత్యం, బుగ్గన్న, రవి, పురుషోత్తం, ఆశన్న, శేఖర్, కృష్ణయ్య, చంద్రయ్య, రమణ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న బీసీ సమాజ్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతి



జడ్చర్లలో..

కాలనీ గ్రీన్‌బెల్ట్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి బుధవారం మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి, పద్మశాలీ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రజకసంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్, కృష్ణయాదవ్, సత్తయ్య, కృష్ణయ్య, నిరంజన్, సురభి విజయ్‌కుమార్, గోపాల్, నర్సింహులు పాల్గొన్నారు.

మిడ్జిల్: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, బాల్‌రెడ్డి, జంగారెడ్డి, మల్లయ్య, శేఖర్, శ్రీను, వెంకటేష్, మల్లేష్ అంజనేయులు పాల్గొన్నారు.



పద్మావతికాలనీలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహులు

పనిచేసే వారిని ఆశీర్వదించండి



మిడ్జిల్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: ప్రజల కోసం పనిచేసే వారిని ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో, ఈ పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు వచ్చే ఎన్నికలలో ఓట్లు వేయాలని సూచించారు. ప్రజల కోసం పని చేసే కేసీఆర్ కావాలో, రైతులకు 3గంటల కరెంట్ ఇస్తామని చెప్పే కాంగ్రెస్ కావాలో నిర్ణయించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదని, మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందన్నారు. కాంగ్రెస్‌లో 20 మంది ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నారని వారు సీటు కోసం కొట్లాడుకోవడం తప్పా, ప్రజల కోసం కాదని అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖా, తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, వైస్‌ఎంపీపీ తిరుపతమ్మ పాల్గొన్నారు.

బోయలకుంటకు బీటీ రోడ్డు మంజూరు

జడ్చర్ల: మండలంలోని బోయలకుంటకు బీటీ రోడ్డు మంజూరైనట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బాదేపల్లి నుంచి బోయలకుంట వరకు 2 కి.మీ.ల మేరకు రూ.1.20 కోట్లతో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడుతామన్నారు. బోయలకుంటకు బీటీరోడ్డు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

ప్రతి రోజు వ్యాయామం చేయాలి



ర్యాలీ చేస్తున్న వైద్యులు

పాలమూరు: ఈనెల 29న ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రణయ్ కార్డియాక్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలో హైపర్‌టెన్షన్‌పై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ ప్రణయ్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలని, ప్రతి రోజు 45నిమిషాల పాటు వ్యాయామం చేయాలని సూచించారు.

రైతులకు సకాలంలో ఎరువులు, రుణాలు



మాట్లాడుతున్న అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి

చిన్నచింతకుంట: రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులను అందించి ఇబ్బందులు కలగకుండా చూడాలని పీఏసీఎస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. సంఘం ద్వారా రుణాలు పొంది దీర్ఘకాలిక బకాయి ఉన్న రైతుల చేత వసూలు చేసి సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. గోదాముల పనులను త్వరగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సంఘానికి చెందిన భూమి కొంత కబ్జాలో ఉందని దానిని సర్వే చేయించాలని సభ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, సీఈఓ బషీర్, గోవిందరాజు, విజయ సారథిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన వినాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పండుగలు సంప్రదాయానికి ప్రతీక అని జిల్లా అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. లడ్డూను అడిషనల్ కలెక్టర్‌కు అందజేశారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. కొన్ని ఉత్సవ కమిటీలు 9రోజుల పాటు పూజలు నిర్వహించి బుధవారం నిమజ్జనం చేశారు.

బాలానగర్: మండలంలోని గణనాథుడి నిమజ్జనం కనుల పండువగా సాగింది.

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని అప్పాయిపల్లిలో గణనాథునికి ఎంపీపీ సుధాశ్రీ, సర్పంచ్ ఊషన్న, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావోద్దీన్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమంలో వారంతా పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో వినాయకుడిని కదిలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు

ఆశా కార్యకర్తల ఆందోళన

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో ఆశావర్కర్ల సమ్మె కొనసాగింది. బుధవారం అడ్డాకులలో కాంగ్రెస్ నాయకులు సమ్మెకు మద్దతు పలికి మాట్లాడారు. ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్‌షఫి, శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, పరశురాములు, నవీన్ తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో ఆశాకార్యకర్తలు మాట్లాడుతూ తమను గుర్తించి ప్రభుత్వం గౌరవ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, పద్మ, మౌనిక, పరమేశ్వరి, పుష్పమ్మ పాల్గొన్నారు.

జడ్చర్ల: ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి కావేరమ్మపేట అర్బన్ హెల్త్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సెంటర్ ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి సమతకు సమర్పించారు. కార్యక్రమంలో లలిత, శివలీల, నర్సమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి



అడ్డాకుల: ఈనెల 29న వనపర్తి జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటనను బీఆర్‌ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీటీసీ రంగన్నగౌడ్ నివాసంలో బుధవారం మండల ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల 1న రాచాలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రానున్నారని తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పాఠశాల స్థలంలో ఇతర భవనాలను కట్టొద్దు

కోయిల్‌కొండ: మండలంలోని ఉబ్బడితండాలో ప్రభుత్వ పాఠశాల స్థలంలో పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, వెంటనే పనులను ఆపాలని గ్రామస్తులు బుధవారం ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్, ఎస్‌ఐ విజయ్‌భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. అదేవిధంగా పాఠశాల స్థలంలో రూ.1.50లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను సర్పంచ్ శాంతిబాయి నేలమట్టం చేయించారని, దీంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని వారిపై చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'సఫాయి మిత్ర సురక్ష'లో భాగంగా పట్టణంలోని నాలుగు యూపీహెచ్‌సీలలో రెండోరోజు బుధవారం 113 మంది పారిశుద్ధ్య కార్మికులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. శిబిరాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వాణీకుమారి పర్యవేక్షించారు.

ఎల్‌ఓసీ అందజేత

బాలానగర్: మండల కేంద్రానికి చెందిన బాలా చెన్నమ్మ తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా, చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని వైస్ ఎంపీపీ వెంకటచారి బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. ఆయన వెంట శ్రీనివాస్‌యాదవ్, రవికుమార్, శివ, ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పాలమూరులో మాలల ఆత్మగౌరవ సభ

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో మాలల ఆత్మగౌరవ సభలు నిర్వహించాలని హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర విస్తృత స్థాయిలో సమావేశంలో తీర్మానించినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి తెలిపారు. మాలలు రాజకీయ శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన ప్రజా యోద్ధనౌక గద్దర్, సాయిచంద్, ఎమ్మెల్యే సాయన్న, సాయిగిరిలకు రాష్ట్ర కమిటీ తరఫున సంతాపం ప్రకటించామన్నారు. అక్టోబర్ 29న పాలమూరులో నిర్వహించే మాలల ఆత్మగౌరవ సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాలలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రమేష్, సుధాకర్, పురుషోత్తం, అంజయ్య, శ్రీరాములు, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేసిన ప్రభుత్వం



సమ్మె నోటీసు ఇస్తున్న మున్సిపల్ కార్మికులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పంచాయతీ కార్మికులను ప్రభుత్వం మోసం చేసిందని పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం జేఏసీ నాయకులు ఆరోపించారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జేఏసీ కన్వీనర్ కురుమూర్తి, కార్యదర్శి సాంబశివుడు, వెంకటేష్ మాట్లాడుతూ.. 34 రోజులుగా సమ్మె చేసినా పంచాయతీ కార్మికులకు అన్ని డిమాండ్లు పరిష్కారం చేస్తామని చెప్పిన ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు పీఆర్ మంత్రి దయాకర్ రావు ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. మృతి చెందిన కార్మికుల అంత్యక్రియలకు రూ.10వేలు, జీవిత బీమా రూ.5లక్షల ప్రకటించాలని కోరారు. 8గంటల పనిని అమలు పరచాలని, పని ఒత్తిడి తగ్గించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు సమర్పించారు. అక్టోబర్ 5న చలో హైదరాబాద్, సమ్మెలోకి వెళ్లాలని జేఏసీ నిర్ణయించినట్లు వారు తెలిపారు. దేవదానం, వెంకటేష్‌గౌడ్, రాజ్ కుమార్, నారాయణ, మైబు, కురుమన్న, ఎల్లమ్మ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

జడ్చర్ల టౌన్: సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం కార్మికులను పర్మనెంట్ చేయకపోతే సమ్మె తప్పదని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన నోటీసును సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించకపోతే అక్టోబర్ 3న హైదరాబాద్‌లో మహాధర్నాకు వెళ్తామన్నారు. ధర్నా అనంతరం సమ్మెకు వెళ్తామని నోటీసులో పొందుపర్చారు. శివలీల, దేవమ్మ, అంజమ్మ, రసూల్‌బీ, యాదమ్మ, రాజు, రమేష్, పాండు పాల్గొన్నారు.

నిరుద్యోగులను రోడ్డుకిడ్చిన ప్రభుత్వం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రెండో సారి గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దుతో నిరుద్యోగుల జీవితాలను మరోసారి రోడుకిడ్చిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్ ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించక రద్దుకు కారణమయ్యారన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో శివ, సాయి, వీరమోహన్, రాఘవేందర్, మౌనిక, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

పెద్దల సమక్షంలో వివాహం

హన్వాడ: మండలంలోని మాధారం చెందిన గొల్ల నాగరాజు, అదేగ్రామ పరిధిలోని తండాకు చెందిన అనూష కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఈవిషయం కుటుంబసభ్యులకు తెలియడంతో అడ్డు చెప్తారనే భయంతో వారు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆశ్రయించారు. ఎస్‌ఐ రవినాయక్ ఇరువురి కుటుంబీకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబీకులు సమ్మతించడంతో వారికి సమీపంలోని శ్రీర్యాకమకొండపై లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివాహం చేశారు. గ్రామపెద్దలు, ఇరువురి కుటుంబీకులు ఆశీర్వదించారు.

చెక్‌డ్యాం పనుల పరిశీలన

భూత్పూర్: మండలంలోని రావులపల్లిలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను బుధవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అన్నాసాగర్ నుంచి రావులపల్లి వెళ్లే దారిలో కాజ్‌వే ఉండగా వరద ధాటికి కొట్టుకుపోగా, గ్రామానికి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. దీంతో ఇటీవల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అదేవిధంగా పోతులమడుగు చెందిన బొజ్జయ్యకు కృత్రిమ చెయ్యి నిమిత్తం రూ.1.50లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



రావులపల్లిలో చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

క్యాంపస్ సెలక్షన్స్‌లో 13 మంది ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో బుధవారం దివిటిపల్లి ఐటీ టవర్‌లోని హెచ్‌ఆర్‌హెచ్ కంపెనీ ఆధ్వర్యంలో టాస్క్ ద్వారా క్యాంపస్ సెలక్షన్స్ చేపట్టారు. ఇందులో 40 మందికి పైగా హాజరుకాగా బీపీఓలుగా 13 మందిని ఎంపిక చేశారు. వీరికి శిక్షణ అనంతరం వివిధ స్థాయిల్లో ఉద్యోగాల్లో నియామకం చేయనున్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాసయ్య అభినందించారు. టాస్క్ రిలేషన్ మేనేజర్ సిరాజ్, అకాడమిక్ డైరెక్టర్ రజినీకాంత్, ప్రిన్సిపాల్ కొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను పట్టించుకోకపోవడం దారుణం

మిడ్జిల్: సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలకు బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడంతో దారుణమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గౌస్, సాయిలు, పర్వతాలు, ఉస్మాన్, చంద్రమౌళి, కృష్ణ, శ్రీనునాయక్, శంకర్‌నాయక్, అశోక్ పాల్గొన్నారు.



మిడ్జిల్‌లో మాట్లాడుతున్న అల్వాల్‌రెడ్డి

దేవరకద్ర: అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. మండల పరిషత్ వద్ద చేపట్టిన సమ్మెలో భాగంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పీఎఫ్ ఈఎస్‌ఐ, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, కవిత, రాణి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

భూత్పూర్: మండలంలోని కర్వెన మాజీ సర్పంచ్ గడ్డం రంగారెడ్డి (70) అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కర్వెన సర్పంచ్, భూత్పూర్ మండల సింగిల్ విండో చైర్మన్‌గా ఈయన పనిచేశారు. ఇటీవల అనారోగ్యానికి గురికాగా హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చేర్పించారు. గుండెకు శస్త్ర చికిత్స చేసిన కొద్ది రోజులకే ఆస్పత్రిలో మృతి చెందారు.

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440339760

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440339760

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440339760

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440339760

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com